నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
18 మార్చి 2025
పేజీలు: 02



## చేనేతలకి ప్రభుత్వం గుడ్ న్యూస్

చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పవర్‌లూం యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాల వల్ల 93 వేల చేనేత కార్మికుల కుటుంబాలకు, 10,534 పవర్‌లూం యూనిట్లకు లబ్ధి చేకూరనుంది. ఎన్నికల సమయంలో ఈ రెండు హామీలూ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని నెరవేర్చారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సోమవారం అమరావతి సచివాలయంలో 4 గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని అమరావతిలో వివిధ పనులను ఆయా సంస్థలకు అప్పగించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. రాష్ట్ర ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్టం 2025ను ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది.



### టెన్త్ పరీక్షలు.. ఒంటిపూట బడుల

## సమయం మార్పు

AP: ఒంటిపూట బడుల సమయంలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఎగ్జామ్స్ జరుగుతున్న పాఠశాలల్లో ఒంటిపూట బడుల ప్రారంభ సమయం మ.1.30 గంటలకు మార్చాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. టెన్త్ పరీక్షా పత్రాలు వెళ్లేంత వరకు విద్యార్థులు ఎండలో వేచి ఉండటంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందు మ.1.15 గంటలకు స్కూళ్లు ప్రారంభమయ్యేవి.



### తెలిసో తెలియకో తప్పు చేశాను..

## క్షమించండి

'గతంలో నేను బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేశాను. క్షమించండి. తెలిసో తెలియకో చేసిన నా తప్పుని క్షమిస్తారని అనుకుంటున్నాను' అని రీతూ చౌదరి తెలిపింది. దయచేసి ఏ బెట్టింగ్ యాప్స్‌ను నమ్మకండని రీతూ చెప్పుకొచ్చింది. అయితే సారీ చెప్పినంత మాత్రాన పోలీసులు వీళ్లని వదిలేస్తారా అనేది సందేహమే.దీంతో ఇలాంటి బెట్టింగ్ యాప్స్‌ని బ్యాన్ చేస్తూ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే ఇలాంటి యాప్స్‌ని ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలపై కూడా దృష్టి పెట్టింది. ఒకరిద్దరు యూట్యూబర్లని కూడా అదుపులోకి తీసుకుంది. దీంతో మిగిలిన యూట్యూబర్లు, సెలబ్రెటీలు అలర్ట్ అయి నష్టనివారణ చర్యలు చేపడుతున్నారు. తాజాగా తమ సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్స్‌కి నో చెప్పండి అంటూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. తాజాగా ఈ లిస్ట్‌లో బుల్లితెర బ్యూటీ రీతూ చౌదరి కూడా చేరింది.



### నాకు కేసుల నుంచి

## విముక్తి కల్పించండి

వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై నమోదు చేసిన తప్పుడు కేసుల నుంచి విముక్తి కల్పించాలని ముంబై నటి/మోడల్ కాదంబరి జెత్వానీ ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న పది సెల్‌ఫోన్లను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల విద్యాసాగర్, సజ్జన్ జిందాల్ కలిసి ఢిల్లీ కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌తో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం విజయవాడలో మహిళా సంఘాల సమాఖ్య ప్రతినిధులు సుంకర పద్మశ్రీ, బొల్లినేని కీర్తి, రమాదేవి, దుర్గాభవానీలతో కలిసి జెత్వానీ విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత తనకు న్యాయం చేయాలని.. తప్పుడు కేసుల కారణంగా తన కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించినా పురోగతి లేదని, ఇప్పటి వరకు ఫోరెన్సిక్ నివేదిక రాలేదని.. తనను వేధించిన నిందితులపై చర్యలు తీసుకోలేదని.. తనపై తప్పుడు కేసులు పెట్టడానికి కారకుడైన విద్యాసాగర్ మాత్రం బెయిల్‌పై యథేచ్ఛగా తిరుగుతున్నాడని.. అతడిని వెనుక నుంచి సజ్జనే నడిపిస్తున్నాడని ఆరోపించారు.

### గాజాపై మళ్లీ విరుచుకుపడ్డ ఇజ్రాయిల్..

# 220 మంది పాలస్తీనియన్ల మృతి



బంధీలను రిలీజ్ చేసేందుకు హమాస్ నిరాకరించింది. దీంతో ఇజ్రాయిల్ మిలిటరీ వైమానిక దాడులు చేపట్టింది. తాజా అటాక్‌లో సుమారు 130 మంది పాలస్తీనియన్లు మృతిచెందారు. మరో 300 మంది గాయపడ్డారు. సీనియర్ హమాస్ సెక్యూర్టీ అధికారి అబూ వాఫా హతమయ్యాడు.గాజా: గాజా స్ట్రిప్‌పై విస్తృత స్థాయిలో ఇజ్రాయిల్ భీకర దాడులు చేస్తున్నది. ఆ దాడుల్లో సుమారు 220 మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్లు హమాస్ నేతృత్వంలోని ఆరోగ్యశాఖ వెల్లడించింది. హమాస్ టెర్రర్ కేంద్రాలను టార్గెట్ చేస్తున్నట్లు ఇజ్రాయిల్ డిఫెన్స్ దళం పేర్కొన్నది. తాజా దాడిలో హమాస్ సెక్యూర్టీ అధికారి మహమూద్ అబూ వఫా హతమైనట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది. జనవరి 19వ తేదీన కుదిరిన కాల్పుల విమరణ ఒప్పందం తర్వాత గాజాలో జరిగిన అతిపెద్ద వైమానిక దాడి ఇదే. గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు జరిగిన చర్చలు విఫలం అయ్యాయి.

సుమారు 20 ఇజ్రాయిలీ యుద్ధ విమానంలో అటాక్‌లో పాల్గొన్నాయి. గాజా సిటీ, రఫా, ఖాన్ యూనిస్ ప్రాంతాల్లోని హమాస్ కేంద్రాలను ఆ దాడి ద్వారా టార్గెట్ చేశారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యూ, రక్షణ మంత్రి ఇజ్రేల్ కట్జ్.. మంగళవారం ఉదయం దాడులకు ఆదేశించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని చెప్పింది. బంధీలను విడుదల చేసేందుకు హమాస్ నిరాకరించడంతో.. ఇజ్రాయిల్ మళ్లీ వైమానిక దాడులకు దిగింది. సైనిక చర్యను మరింత పెంచనున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించినట్లు హమాస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడితో బంధీల భవిష్యత్తు ఆంధకారంలోకి వెళ్తుందని హమాస్ పేర్కొన్నది. అయితే మళ్లీ యుద్ధాన్ని ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు హమాస్ ఇంకా ప్రకటించలేదు. ఇజ్రాయిల్ దూకుడును అడ్డుకునేందుకు మధ్యవర్తులు, ఐకరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని హమాస్ కోరినట్లు తెలుస్తోంది. హమాస్‌పై దాడికి ముందు అమెరికా సర్కారుకు ఆ విషయాన్ని చర్చించినట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది.








### తెలంగాణలో మరోసారి పెరగనున్న

## మద్యం ధరలు!

తెలంగాణలో మద్యం ధరలు మరోసారి పెరగనున్నాయి. మద్యం సరఫరా కోసం ప్రభుత్వం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30తో ముగియనుంది. దీంతో ఏప్రిల్ మొదటి వారంలో ధరలు పెంచి, ఆ వెంటనే ఒప్పందాలు చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. చీప్ లికర్, మీడియం, ప్రీమియం, విదేశీ దిగుమతి లికర్ ప్రాథమిక ధర మీద 18 శాతం పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. బీర్ల ధరలను కూడా మరోసారి రూ.10 పెంచనున్నట్లు తెలుస్తోంది.



## ఉమ్రాన్ మాలిక్ ఔట్

ఐపీఎల్-18 సీజన్ ఆరంభానికి ముందే కేకేఆర్ పేసర్ ఉమ్రాన్ మాలిక్ సీజన్ నుంచి వైదొలిగాడు. గాయం కారణంగా అతడు సీజన్ మొత్తానికి దూరమైనట్టు కేకేఆర్ తెలిపింది. ఐపీఎల్-18 సీజన్ ఆరంభానికి ముందే కేకేఆర్ పేసర్ ఉమ్రాన్ మాలిక్ సీజన్ నుంచి వైదొలిగాడు. గాయం కారణంగా అతడు సీజన్ మొత్తానికి దూరమైనట్టు కేకేఆర్ తెలిపింది. ఈ సీజన్‌కు ముందు నిర్వహించిన వేలంలో ఉమ్రాన్‌ను రూ.75 లక్షల నామమాత్రపు ధరకు దక్కించుకున్న కేకేఆర్.. అతడి స్థానాన్ని చేతన్ సకారియాతో భర్తీ చేయనుంది.



### టీవీలో క్రైం షోలు చూసి

## భార్యను హత్య చేసి భర్త



మధ్యప్రదేశ్ లో దారుణం చోటుచేసుకుంది. టీవీలో క్రైం షోలు చూసి భార్యను హత్య చేసిన ఓ వ్యక్తి.. ఈ దారుణాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. గ్వాలియర్కు చెందిన ప్రదీప్ గుర్జర్ భార్యను చంపి మృతదేహాన్ని కంపూ పీఎస్ పరిధిలో రోడ్డుపై పడేశాడు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిందని పోలీసులకు తెలిపాడు. ప్రదీప్ చిత్రహింసల వల్లే ఆమె చనిపోయిందని మృతురాలి బంధువులు ఆరోపించారు. మహిళ పోస్టుమార్టం రిపోర్టులో అదే తేలడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

### ఎస్సీ వర్గీకరణ బిల్లుపై

## నేడు అసెంబ్లీలో చర్చ



ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరగనున్నది. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు మాట్లాడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. అలాగే ఇవాళ ఆరు ప్రభుత్వ బిల్లులు(ఎస్సీ వర్గీకరణతో పాటు మరో ఐదు బిల్లులు) ప్రవేశపెట్టనున్నారు. కాగా, సభలో నేడు ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు.ఎస్సీలకు రాజ్యాంగబద్ధంగా 15శాతం రిజర్వేషన్ అమలవుతున్నది. ఆ కోటాలో మాలలే ఎకువగా లబ్ధిపొందుతున్నారనే చర్చ 1970 దశకంలోనే మొదలైంది.

## మునుపటికంటే స్ట్రాంగ్ అయ్యా..


'కెమెరా ముందు నేను నిల్చున్న చోటే.. ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన చోటు' అంటున్నది అగ్ర కథానాయిక సమంత. వచ్చే నెల నుంచి సామ్ సినిమాలతో బిజీ కానున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తనకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది సమంత.'నేను మునుపటికంటే స్ట్రాంగ్‌గా ఉన్నాను. నా జీవనశైలిని మార్చుకోవడం వల్లే ఈ మార్పు సాధ్యమైంది. మనలోని బలహీనతల్ని ఎలాగైనా అధిగమించాలని అందరం అనుకుంటాం. కానీ చంచలమైన మన మనసు వాటిని అధిగమించనివ్వదు. దానికి కళ్లెం వేయాలంటే ఆధ్యాత్మికతకు మించిన దారిలేదు. గత మూడేళ్లలో ఎదురైన సమస్యలవల్ల మానసికంగా కృంగిపోయిన నన్ను ఆధ్యాత్మిక మార్గమే మనిషిని చేసింది. ఇప్పుడు నేను మానసికంగా కూడా బలంగా ఉన్నా.' అని చెప్పుకొచ్చింది సమంత.



## ఢిల్లీ వైస్ కెప్టెన్‌గా డుప్లెసిస్

గత రెండు సీజన్లలో ఆర్‌సీబీకి సారథిగా వ్యవహరించిన దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్.. త్వరలో మొదలుకాబోయే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. వేలానికి వెళ్లిన డుప్లెసిస్‌ను ఢిల్లీ రూ.2 కోట్లతో దక్కించుకుంది.ఢిల్లీ : గత రెండు సీజన్లలో ఆర్‌సీబీకి సారథిగా వ్యవహరించిన దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్.. త్వరలో మొదలుకాబోయే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## మే 7నుండి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకి వేసవి సెలవులు

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ఐటీ క్యాంపస్‌లకు మే 7 నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు మే 7న పరీక్షలు ముగుస్తున్నందున సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇంజనీ రింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని క్యాంపస్ నుంచి వెళతా రని, సెమిస్టర్లలో ఉత్తీర్ణులకు వేసవిలో రెమిడి యల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ సమ్మర్ ప్రాసెస్ నిర్వహించడం జరుగుతుందని, విధివిధానాలను త్వరలో నిర్ణ యించనున్నట్లు ఆయన తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బ్రాంచ్ ఓరియంటేష న్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, తర్వాత సెలవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రిపుల్ఐటీ క్యాంపస్‌లలో జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.




## సికింద్రాబాద్‌లో ఎయిర్‌పోర్ట్‌ను తలదన్నేలా..!!

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్.. రెండు తెలుగు రాష్ట్రాల్లో కోట్లాదిమందికి చిరపరిచితం. మొత్తం 10 ప్లాట్‌ఫామ్స్, 11 ట్రాక్స్ ఉన్న స్టేషన్ నుంచి నిత్యం 241 రైళ్లు దేశం నలుమూలలకూ రాకపోకలు సాగిస్తోంటాయి.
దేశంలో అత్యధిక ఆదయాన్ని ఆర్జించే జోన్లల్లో ఒకటిగా ఉండే దక్షిణ మధ్య రైల్వేకు కేంద్ర బిందువు.
ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలకు విస్తరించిన ఈ అతిపెద్ద జోన్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయం ఉండేది సికింద్రాబాద్‌లోనే. వందే భారత్, రాజధాని, శతాబ్ది సహా అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తోన్నాయి. ఇప్పటివరకు కనెక్టివిటీ లేని నగరాలకూ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలు, రైళ్లు, ప్లాట్ ఫామ్‌ల సంఖ్యకు అనుగుణంగా దీన్ని మరింత విస్తరింపజేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఆధునికీకరిస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయంలో తరహాలో దీన్ని తీర్చిదిద్దుతోంది. దీనికి సంబంధించిన పనులు శరవేగంగా కొసాగుతున్నాయి.
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణానికి 712 కోట్ల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపట్టింది కేంద్ర ప్రభుత్వం. మూడు దశల్లో పూర్తి కానున్నాయి. వచ్చే 40 సంవత్సరాల వరకు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎయిర్ పోర్ట్ తరహాలో ఈ స్టేషన్ పునర్నిర్మితం కానుంది. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తవుతాయనే అంచనాలు ఉన్నాయి. తెలంగాణలో- సికింద్రాబాద్ సహా మలక్‌పేట్, మహబూబ్ నగర్, కామారెడ్డి, నిజామాబాద్, మల్కాజ్‌గిరి, ముద్ఖేడ్, ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్, మహబూబాబాద్, హైటెక్ సిటీ, హఫీజ్‌పేట్, జహీరాబాద్, తాండూరు, భద్రాచలం రోడ్, హుప్పగూడ, యాదాద్రి, ఖాజీపేట్ జంక్షన్, మధిర.. వంటి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే.
రైల్వే స్టేషన్ పనుల పురోగతికి సంబంధించిన వివరాలను కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి వెల్లడించారు. కొన్ని ఫొటోలను తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. దక్షిణం వైపు ఉన్న బేస్‌మెంట్, అప్రోచ్ రోడ్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఫినిషింగ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

## నేను కాగితపు పువ్వును కాదు..

ముఖేష్ అంబానీ కొడుకు అనంత్ అంబానీ, రాధికల వివాహం రంగరంగవైభవంగా జరిగిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెలబ్రిటీలంతా ఈ వేడుకలో పాల్గొన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చెందిన స్టార్లలో వివాహ వేడుక పాలపుంతలా మారింది. అతిథులంతా తమ కుటుంబంలో పెళ్లిలా ఎంజాయ్ చేశారు. ఖరీదైన బహుమతులు కూడా అందుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే.. తాప్సీ మాత్రం ఆ పెళ్లికి వెళ్లలేదు. దీనిపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. 'పెళ్లి అనేది అనుబంధాల కలయిక. బంధువులు, స్నేహితులు, కుటుంబీకులు, ఇరుగు, పొరుగు అందర్నీ ఒకచోటకు చేర్చే గొప్ప వేడుక పెళ్లి. నిజం చెప్పాలంటే టీవీల్లో చూడ్డం తప్ప వాళ్లెవరో కూడా నాకు తెలీదు. తెలీని వారి పెళ్లికి వెళ్లి, ఆర్టిఫీషియల్ ఆనందాన్ని పొందడం నాకు చేతకాదు. నేను కాగితపు పువ్వును కాదు, సువాసన వెదజల్లే జీవం ఉన్న పుష్పం లాంటిదాన్ని.' అంటూ సెటైర్లు విసిరింది తాప్సీ.



## మార్చిలోనే మండుతున్న ఎండలు.. వడదెబ్బ నుంచి రక్షణ తప్పనిసరి!

మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. మండుటెండలో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. భానుడు రోజురోజుకు నిప్పల వర్షం కురిపించడంతో ఇప్పడే 37నుంచి 40 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండవేడిమిని తట్టుకోలేక రోజువారి కూలీలు, రైతులు, ఉపాధి కూలీలు చిన్న పిల్లలు, వృద్దులు, రోగులు అల్లాడుతున్నారు.యాచారం, మార్చి 18: మార్చిలోనే ఎండలు (Summer Heat) మండిపోతున్నాయి. మండుటెండలో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. భానుడు రోజురోజుకు నిప్పల వర్షం కురిపించడంతో ఇప్పడే 37నుంచి 40 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండవేడిమిని తట్టుకోలేక రోజువారి కూలీలు, రైతులు, ఉపాధి కూలీలు చిన్న పిల్లలు, వృద్దులు, రోగులు అల్లాడుతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఎప్రిల్, మే నెలల్లో ఎండ ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుందని ప్రజలు ఆందోళకు గురవుతున్నారు. కొంతమంది ఎండలో బాగా తిరగడంతో శరీరంలోని నీటి శాతం తగ్గిపోయి బలహీనత చోటుచేసుకుంటుంది. దీంతో బ్లడ్ప్రెషర్ పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో పాటు తలనొప్పి, తల తిరగడం లాంటి అనేక రకాల శారీరక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఎండవేడిమికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. వడదెబ్బ తీవ్రతతో ప్రాణాలను సైతం కోల్పోవల్సి వస్తుంది. వడదెబ్బ తగలకుండ ఉండేందుకు తగిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకుంటే సమస్యను అధిగమించవచ్చని మండల సీఎస్‌సీ వైద్యురాలు ప్రియాంక తెలిపారు. తగిన సలహాలు, సూచనలు అందజేశారు.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో ఎంతో మంది ప్రజలు వడదెబ్బతో ఎన్నో అవస్థలు పడుతుంటారు. కొంత మంది ఏకంగా ప్రాణాలను సైతం కోల్పోతారు. వడదెబ్బ లక్షణాలను ముందే గుర్తించి తగిన జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ బారీ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. వడదెబ్బకు గురైన వారి శరీరం వేడిగా ఉండి చెమట పట్టదు. చర్మం వేడిగా, పొడిగా మారి ఎర్రబడుతుంది. విపరీతమైన తలనొప్పి, తల తిరుగుడు, కండ్లు తిరిగి పడిపోవడం లాంటి సమస్యలు బాదిస్తాయి. శ్వాస పీల్చుకోవడంలో తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుంది. అలసట, నిసత్తువ నెలకొంటుంది. గుండె కొట్టుకునే వేగం పెరగడం సంబవిస్తుంది. చిరాకు, కంగారు, అపస్మారక స్థితితో ఇబ్బందులెదుర్కొంటారు. వాంతులు సంబవిస్తాయి. మానసికమైన కలత, పెద్దవారు స్పృహకోల్పోవడం. చివరకు మెదడు పనితీరు మారిపోవడం లాంటి అనేక సమస్యలతో ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.




## మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు..

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి థర్డ్ సింగిల్ అప్డేట్ వచ్చేసింది. మహాదేవ శాస్త్రి పరిచయ గీతాన్ని మార్చి 19న డాక్టర్ ఎం. మోహన్ బాబు గారి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆవిష్కరించనున్నారు. మోహన్ బాబు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించడమే కాకుండా ఇందులో మహాదేవ శాస్త్రి పాత్రను కూడా పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన పుట్టినరోజు సందర్భంగా మరో సర్‌ప్రైజ్ రెడీ చేసింది చిత్ర యూనిట్. డాక్టర్ ఎం. మోహన్ బాబుతో పాటుగా ఈ చిత్రంలో విష్ణు మంచు, ప్రీతి ముకుందన్, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, ముఖేష్ రిషి, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. ప్రఖ్యాత సంగీత దర్శకుడు మిస్టర్ స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన పాటలు ఇప్పటికే శ్రోతలను అలరించాయి. ఇక ఇప్పుడు మూడో పాటగా మహ దేవ శాస్త్రి పరిచయ గీతాన్ని విడుదల చేయనున్నారు. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రాన్ని ముకేష్ కుమార్ సింగ్ తెరకెక్కించారు. ఏప్రిల్ 25న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. దాదాపు 200 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తున్న అప్ డేట్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి.



## రేపు భూమ్మీదకు రానున్న సునీతా విలియమ్స్.. మొదలైన తిరుగుపయణం ప్రక్రియ

ఎనిమిది రోజుల మిషన్ కోసం వెళ్లి దాదాపు తొమ్మిది నెలలపాటు అంతరిక్షకేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు ఎట్టకేలకు భూమికి చేరబోతున్నారు.ఎనిమిది రోజుల మిషన్ కోసం వెళ్లి దాదాపు తొమ్మిది నెలలపాటు అంతరిక్షకేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు ఎట్టకేలకు భూమికి చేరబోతున్నారు. బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్ దిగుతుంది. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్ నుంచి వీరి తిరుగు ప్రయాణానికి సంబంధించిన ప్రక్రియ ఇవాళ మొదలైంది. వ్యోమగాములను తీసుకొచ్చేందుకు అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్‌లోకి భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ (Sunita Williams), బుచ్ విల్మోర్ (Butch Wilmore)తోపాటు మరో ఇద్దరు వ్యోమగాములు అడుగుపెట్టారు. దీన్ని అమెరికా అంతరిక్ష కేంద్రం నాసా (NASA) ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.



మరికాసేపట్లో వీరి ప్రయాణం మొదలవుతుంది. మంగళవారం ఉదయం 8:15 గంటలకు స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ హ్యాచ్ మూసివేత ప్రక్రియ ప్రారంభమైనట్లు నాసా తెలిపింది. ఇక ఉదయం 10:15 గంటలకు అన్‌డాకింగ్ ప్రక్రియ కూడా మొదలైంది. ఈ ప్రక్రియనంతా నాసా కేంద్రంలోని శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు.
సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ దాదాపు తొమ్మిది నెలలుగా ఐఎస్ఎస్‌లోనే ఉంటున్న విషయం తెలిసిందే. టెస్ట్ మిషన్ కోసం బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో విలియమ్స్, విల్‌మోర్ 2024, జూన్ 5న అంతరిక్షంలోకి వెళ్లారు. ఎనిమిది రోజుల తర్వాత వారు భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్.. ఐఎస్ఎస్‌ను చేరుకోగానే సమస్యలు తలెత్తాయి. అందులోని ప్రొపల్షన్ సిస్టమ్‌లో లీకులు ఏర్పడటం, థ్రస్టర్స్ మూసుకుపోవడంతోపాటు హీలియం కూడా అయిపోయింది.




## షూటింగ్ ముగించుకున్న 'కూలీ'

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'కూలీ' కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా చూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు నెక్స్ట్ లెవెల్‌లో క్రియేట్ అయ్యాయి. ఇక ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే వచ్చిన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేశాయి.అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో చిత్ర యూనిట్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చింది. ఈ సినిమా షూటింగ్ ముగించుకున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా ఓ వీడియో ద్వారా వెల్లడించారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. రజినీకాంత్‌ను మరింత స్టైలిష్‌గా దర్శకుడు లోకేశ్ చూపించబోతున్నాడని ఈ సినిమా పోస్టర్స్ చూస్తేనే అర్థమవుతుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.